

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 25.0
తణుకు : 30.0 - 25.0



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల

# హైవే దారెటు?




(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు జాతీయ రహదారి 165 పూర్తి చేసేందుకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ నాగరాణి దీనిపై సమీక్ష జరిపారు. ఉండి నుంచి వీరవాసరం వరకు 17.7 కిలోమీటర్ల పొడవునా భూసేకరణ పూర్తికాలేదు. న్యాయపరమైన చిక్కులతో గతంలో చేసిన ప్రతిపాదనలు పక్కన పెట్టాల్సి వచ్చింది. తాజాగా హైకోర్టులో ఊరట లభించింది. ఉండి మీదుగా కొవ్వాడ అన్నవరం-దుర్గాపురం మీదుగా వీరవాసరం వరకు గతంలో జాతీయ రహదారికి ప్రతిపాదన చేశారు. దానిపై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. హైకోర్టును ఆశ్రయించారు. సదరు ప్రతిపాదనలపై హైకోర్టు స్టే విధించింది. దీంతో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు ఫేజ్-2 జాతీయ రహదారి నిర్మాణం నిలిచిపోయింది. ఇటీవలే హైకోర్టులో స్టేను తొలగించారు. అయితే గతంలో ప్రతిపాదనలపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

## భీమవరంలో మూడు ప్రతిపాదనలు

- ఉండి నుంచి వీరవాసరం వరకు 17.7 కిలోమీటర్లు
- గత ప్రతిపాదనపై కోర్టు చిక్కులు.. ఇటీవలే పరిష్కారం
- జిల్లా కేంద్రమైన తర్వాత మరోసారి కసరత్తు
- భీమవరం నుంచి గరగపర్రు వైపు రెండు.. లోసరి వైపు ఒకటి
- 165 జాతీయ రహదారిపై నిర్ణయం కేంద్రానిదే

రైట్ రైట్



### జిల్లా కేంద్రంతో పెరిగిన రద్దీ

పశ్చిమ గోదావరి జిల్లాకు భీమవరం కేంద్రమైన తర్వాత పట్టణానికి రద్దీ పెరిగింది. ప్రాధామ్యాలు మారుతున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడింది. ఫలితంగా జాతీయ రహదారి సాధ్యాసాధ్యాలపైనా దృష్టి పెట్టారు. హైవే అధికారులు మూడు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. వాటిని సర్వే చేసి అవసరమైన భూముల వివరాలు, గ్రామాల కలయిక, భీమవరంపై దాని ప్రభావం ఎంత ? తదితర అంశాలను పరిగణలోకి తీసుకోనున్నారు. ఆకివీడు నుంచి ఉండి వరకు ఎటువంటి సమస్య లేదు. వీరవాసరం నుంచి భగ్గేశ్వరం మీదుగా దిగమర్రు వరకు ప్రణాళిక అంతా సిద్ధమైంది. భూసేకరణ పూర్తయ్యింది. ఉండి నుంచి వీరవాసరం వరకే ఇబ్బంది తలెత్తింది. భూసేకరణ నిలిచిపోయింది. ప్రస్తుతం మూడు మార్గాలపై అధికారులు దృష్టి పెట్టారు. ఉండి నుంచి భీమవరం మండల గ్రామాల మీదుగా వీరవాసరం వరకు బైపాస్ రహదారిని నిర్మించడం ఒక ప్రతిపాదన. ఇది భీమవరం నుంచి కుడివైపుగా వీరవాసరం వెళుతుంది. మరో రెండు ఉండి మీదుగా భీమవరం నుంచి ఎడమవైపు వెళ్లే ప్రతిపాదనలు. మూడు ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నారు. ముందుగా సర్వే నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. జిల్లా కలెక్టర్ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపుతుంది, అక్కడ మూడు ప్రతిపాదనలపైనా చర్చించి ఒకదానికి ఆమోదముద్ర వేస్తారు. ఆ తర్వాత సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సమర్పిస్తారు. కేంద్రం అనుమతించిన తర్వాత టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు.

### భీమవరం పట్టణానికి ప్రయోజనమెంత ?

జాతీయ రహదారితో భీమవరం పట్టణానికి ప్రయోజనం చేకూరాలి. పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించాలి. బయట నుంచి వచ్చే వాహనాలు బైపాస్ జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోవాలి. మరోవైపు జాతీయ రహదారి గ్రామాలకు అనుసంధానమయ్యేలా రహదారులు ఉంటాయి. గ్రామాలు అభివృద్ధి చెందనున్నాయి. మరోవైపు భీమవరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవుట్ రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు అవుటర్ రోడ్డు ఏర్పడితే పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ సాధ్యపడుతుంది. చుట్టూ రహదారులతో పట్టణానికి రాకపోకలు సులువవుతాయి. ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు జాతీయ రహదారులు ఏర్పడితే పట్టణాభివృద్ధి దిశగా పయనిస్తుంది. ఆ కోణంలోనే ఇప్పుడు జాతీయ రహదారి-165 ప్రతిపాదనలు సిద్ధమయ్యే అవకాశం ఉంది. జిల్లా కేంద్రం కావడంతో గతంలో ప్రతిపాదించిన ప్రాంతం కాకుండా భీమవరానికి దక్షిణ-ఉత్తర దిశగా మరో రెండు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఉండి నుంచి వీరవాసరం వరకు ఇలా రూపకల్పన చేసిన మూడు మార్గాల ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలపై సర్వే నిర్వహిస్తున్నారు. మూడింటిపైనా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు. అక్కడ నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లనున్నాయి. కేంద్రం ఆమోదం తర్వాత ఉండి నుంచి వీరవాసరం వరకు ఏ దిశగా జాతీయ రహదారి వెళుతుందనేది నిర్ధారణ కానుంది. ఆ తర్వాత నిధులు విడుదల చేస్తారు. టెండర్లు పిలుస్తారు. తాజాగా రూ.1200 కోట్లు కేటాయించేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధమైన తర్వాత ఎంత మేర నిధులు అవసరం కానున్నాయనేది అంచనా వేయనున్నారు. ఆ మేరకు కేంద్రం నిధులు విడుదల చేయనుంది. మొత్తంపైన ఆకివీడు నుంచి దిగమర్రు వరకు ఫేజ్-2 165 జాతీయ రహదారి నిర్మాణం కోసం చకాచకా కసరత్తు చేస్తున్నారు.

## వచ్చే నెల రేషన్ బియ్యంతోపాటు
# పంచదార పంపిణీ

భీమవరం టౌన్, ఆగస్టు 24 : రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెప్టెంబరు రేషన్‌తోపాటు కార్డుదారునికి అర కేజీ చక్కెర అందించనున్నారు. జిల్లాలో ఐదు లక్షల 67 వేల 651 మంది కార్డుదారులకు 28 వేల 388 క్వింటాళ్ల చక్కెర అందిస్తారు. ఈ మేరకు సరఫరా పాయింట్లకు సరుకు రానుందని అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచదార అందించారు. అయితే తూకంలో అర కేజీకి వంద గ్రాములు తేడా ఉందని ఫిర్యాదులు రావడంతో సరఫరా నిలిపివేశారు. ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించి అర కేజీ నిక్కచ్చిగా అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నెల నుంచే కందిపప్పు కూడా అందించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి టెండర్లు పూర్తి కాకపోవడంతో కందిపప్పు ఇవ్వడం లేదు.

## పట్టాలెక్కిన విశాఖ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్

నరసాపురం, ఆగస్టు 24 : ఈ ఏడాది జనవరిలో నిలిచిన విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు మూడు రోజుల క్రితం తిరిగి పట్టాలెక్కింది. 17219 నెంబర్‌తో నడిచే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు మచిలీపట్నం నుంచి రాత్రి 9.25 గంటలకు బయలుదేరి కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్ మీదుగా రాత్రి 12 గంటలకు భీమవరం జంక్షన్‌కు వస్తుంది. తణుకు, నిడదవోలు మీదుగా ఉదయం ఎనిమిది గంటలకు విశాఖ చేరుతుంది. తిరిగి 17220 నెంబర్‌తో రాత్రి 10.10 గంటలకు అక్కడ బయలుదేరి మూడు గంటలకు తణుకు, 4.45కు భీమవరం జంక్షన్, 5.13కు భీమవరం టౌన్, 5.30కు ఆకివీడు, ఆరు గంటలకు కైకలూరు చేరు కుని 8.45 గంటలకు మచిలీపట్నం వెళుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ వెళ్లే ప్రయాణీకుల కోసం నరసాపురం నుంచి లింకు డెమో రైలును నడుపుతున్నారు. ఇది నరసాపురంలో రాత్రి 11.10కి బయలుదేరి 11.40కి భీమవరం జంక్షన్‌కు చేరు తుంది. తిరిగి విశాఖ నుంచి వచ్చే ప్రయాణీకుల కోసం భీమవరం జంక్షన్ నుంచి ఉదయం 5.25కి మరో లింకు డెమో రైలు నడుస్తోంది.

## ప్రజల జీవన ప్రమాణాల పెంపుపై ఐసీడీఎస్ ప్రణాళిక

భీమవరంటౌన్, ఆగస్టు 24 : ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. వికసిత భారత్‌లో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐదేళ్ళ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం డివిజన్ స్థాయిలో, తర్వాత క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోనున్నారు. ఈ నెలాఖరులోగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తారు. మాతా, నవజాత శిశు మరణాల తగ్గింపు, శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం మహిళల్లో రక్తహీనత తగ్గించడం, చిన్నారుల్లో జీవన ప్రమాణాలు పెంచటం వంటి అంశాలతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో నాలుగు నెలల్లో 26 మంది నెలలోపు నవజాత శిశువులు, ఇద్దరు తల్లులు, మరో ఆరు శిశు మరణాలు సంభవించాయి. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ రూపొందించనున్నారు. జిల్లాలో ఐసీడీఎస్ అధికారులు ఈ విషయంలో కీలకంగా వ్యవహరించనున్నారు.

# త్వరలోనే టిడ్కో ఇళ్ల పంపిణీ

మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, ఆగస్టు 24 : టిడ్కో గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు టిడ్కో గృహాల సముదాయంలో శనివారం మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 'పాలకొల్లులో నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు 7,164 ఇళ్లు మంజూరు చేసి 95 శాతం పనులు పూర్తిచేశాం. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ కక్ష సాధింపుతో వీటిని పూర్తి చేసి పేదలకు ఇచ్చేందుకు మనసు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఇళ్లపై దృష్టి పెట్టి లబ్ధిదారులకు అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నాం. వచ్చే వారం పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను ఇక్కడకు తీసుకువస్తాం. అధికారులతో సమీక్ష చేయించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించి, వీటిని త్వరలోనే అందిస్తాం' అని మంత్రి చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, మున్సిపల్ ఇంజనీర్ కె.రాజకుమార్, ఏఈలు ఎం.సాంబశివుడు, జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 100 రోజుల్లో 3,561 ఇళ్లు పూర్తి కావాలి



లబ్ధిదారుల వివరాలు తెలుసుకుంటున్న చీఫ్ ఇంజనీర్

భీమవరం టౌన్, ఆగస్టు 24 : జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఫేజ్-1లో రూఫ్ లెవిల్, రూఫ్ శ్లాబ్ దశల్లో వున్న మొత్తం 3,561 ఇళ్లను పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ జి.వీరేశ్వరప్రసాద్ ఆదేశించారు. శనివారం మునిసిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో అధికారులతోను, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమీక్షలో వచ్చే అక్టోబరు 31 నాటికి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా 90 రోజుల పని దినాలకు వేతనం, స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తిచెయ్యాలని అన్నారు. జిల్లా హౌసింగ్ అధికారి జి.పిచ్చియ్య, డివిజన్ హెడ్ హౌసింగ్ బీవీ రమణ, డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## కమిషనర్‌గా రామచంద్రారెడ్డి బాధ్యతల స్వీకరణ



భీమవరం టౌన్, ఆగస్టు 24 : భీమవరం మునిసిపల్ కమిషనర్‌గా కె.రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆదోని మునిసిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్యామలను మాతృ శాఖకు పంపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎమ్మెల్యే అంజిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

# సరుకు నిల్..!



నూతన ఎక్సైజ్ విధానం త్వరలోనే వెలువడనుంది. ఇప్పుడు అందరి దృష్టి రాబోయే కొత్త విధానం మీదే. గడిచిన ఐదేళ్లపాటు ప్రభుత్వం నిర్వహించిన మద్యం దుకాణాలు, ప్రత్యేక మాల్స్ అన్నింటిలోను క్రమేపి సరుకు ఖాళీ అవుతోంది. ఇప్పటికే జనం కోరుకున్న బ్రాండ్‌లు కాకుండా 'జె' బ్రాండ్‌లతో ముంచెత్తి ఆ మేరకే బలవంతపు వ్యాపారం చేశారు. నాణ్యత లేని సరుకుతో జనం విలవిల్లాడారు. అయినాసరే.. రోజుకి ఒక్క ఏలూరు నగరంలోనే కోటికి పైగా వ్యాపారం చేశారు. కొత్త ఎక్సైజ్ విధానంలో సామాన్యుడి దగ్గర నుంచి ఉన్నత వర్గాల వరకు కోరుకున్న సరుకు.. అందుబాటులోనే ధర పేరిట విధానం ఉండబోతుందన్నదే అందరి ఊహ.

- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తగ్గిన నిల్వలు
- రోజువారీ అమ్మకాల్లోను వైవిధ్యం
- కొన్ని బ్రాండ్‌లకే అమ్మకాలు పరిమితం
- చీప్‌తో సరిపెట్టేస్తున్న మరికొన్ని దుకాణాలు
- త్వరలోనే కొత్త పాలసీ.. దీని ప్రభావమే ఇది

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గత ఐదేళ్లలో మందుబాబులు 'జె' బ్రాండ్‌లతో సరిపెట్టుకున్నారు. ఎక్కడా లేని పేర్లతో రకరకాల సరుకు మార్కెట్‌లోకి చొప్పించి బలవంతంగా తాగించారు. ఇష్టానురీతిన మద్యం వ్యాపారం సాగింది. ఎక్కడికక్కడ మద్యం దుకాణాలను ప్రారంభించి వాటి నిర్వహణను ప్రభుత్వమే చూసింది. తాత్కాలికంగా ఉద్యోగులను నియమించి ఏ రోజుకారోజు నగదు చెల్లింపులన్నింటినీ బ్యాంకుకు చేర్చే బాధ్యతను వారికే అప్పగించింది. అంతకుముందు మద్యం వ్యవహారాలన్నీ అబ్కారీ శాఖ పర్యవేక్షణలోనే సాగేది. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ శాఖ నిర్వీర్యమైంది. బార్లు మీద, ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాల మీద ఈ శాఖ తమ అదుపు కోల్పోయింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చీప్ లిక్కర్ రూ.60 నుంచి రూ.90 ధర ఉండేది. గడిచిన ఐదేళ్లలో దీని ధర రెట్టింపు చేసి పేదోళ్ల జేబులు ఖాళీ అయ్యేలా చేశారు. ఒకవైపు మద్య నిషేధం అని రంకెలు పెడుతూనే ఇంకోవైపు మద్యం వ్యాపారంలో ఇష్టానుసారం వ్యవహరించారు.

### ఇంతకీ సరుకేది.. ?

జగన్ ప్రభుత్వం వైదొలిగి కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. నిర్వీర్యమైన ప్రతీ రంగాన్ని ప్రక్షాళన చేస్తోంది. త్వరలోనే నూతన మద్య విధానాన్ని అమలులోకి తేబోతుంది. కాని అంతకుమునుపే మద్యం దుకాణాలు, మాల్స్‌ల్లో మద్యం స్టాక్ ఖాళీ అవుతూ వస్తోంది. కొత్త విధానం అమలులోకి వస్తే పాత విధానంలో ఉన్న అనేక బ్రాండ్‌లకు కాళ్ళు రావచ్చు. అందుకనే త్వరత్వరగా ఉన్న బ్రాండ్‌లన్నిటిని వదిలించుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి పశ్చిమలో చాలాచోట్ల ఉన్న ప్రభుత్వ రిటైల్ షాపులన్నీ కేవలం కొన్ని బ్రాండ్‌లకే పరిమితమయ్యాయి. కేవలం చీప్ రూ.130, రూ.150 రకాల బ్రాండ్‌లు మాత్రమే ఇప్పుడు అమ్మకాలు సాగిస్తున్నారు. బారుల్లో అన్ని రకాల బ్రాండ్‌ల సౌలభ్యత ఉండగా రిటైల్ షాపుల్లో ఒక్కొక్కటిగా బ్రాండ్‌లన్నీ ఖాళీ అవుతున్నట్టు మందు బాబులంతా గోల చేస్తున్నారు. రెండు నెలల ముందు వరకు బ్రాందీ, విస్కీలలో కొన్ని ప్రైమ్ బ్రాండ్‌లను క్వార్టర్లలో విక్రయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పోయి కేవలం రెండు, మూడు రకాలకే పరిమితం అయ్యారన్న ఆగ్రహంతో ఉన్నారు. రిటైల్ షాపులన్నింటిలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. పనిలో పనిగా ఇక్కడ అమ్మకాలు తగ్గించడంతో విసుగెత్తిన జనం బారుల వైపు మొగ్గుతున్నారు. దీంతో రూ.150 భరించే సాధారణ వ్యక్తి ఇప్పుడు రూ.280 చేతి చమురు వదిలించే పరిస్థితిలో మందుబాబులు ఉన్నారు. తాజా పరిస్థితిపై తనిఖీలు చేయాల్సిన యంత్రాంగం చేతులెత్తేసింది. ఆబ్కారీ శాఖ పట్టనట్టుగానే మిగిలింది.

### కొత్త విధానం ఎలా ఉండబోతుంది..

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని కొద్దిరోజుల్లోనే తేబోతుంది. అందరి దృష్టి దానిపైనే పడింది. ప్రభుత్వమే నిర్వహిస్తున్న మాల్స్, రిటైల్ దుకాణం స్థానంలో మార్పులు, చేర్పులు రాబోతున్నాయని ప్రచారం సాగుతోంది. జగన్ ప్రభుత్వంలో ప్రజలతో చెలగాటమాడిన ప్రెసిడెంట్ పీల్, భూమ్‌భూమ్, బ్లాక్ బస్టర్, రాయల్ ప్యాలెస్ వంటి బ్రాండ్‌ల స్థానంలో ప్రత్యేక బ్రాండ్‌లన్నీ కొత్త విధానంలో మార్కెట్‌లోకి రావచ్చని భావిస్తున్నారు. మద్యం ప్రియులు అత్యధికంగా కోరుకునే 19 రకాల బ్రాండ్‌లు ఈసారి రాబోతున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇంపీరియల్ బ్లూ (ఐబీ), రాయల్ స్టాగ్, ఎంసీ విస్కీ వంటి రకాలన్నింటినీ తిరిగి విక్రయించబోతున్నారనే సమాచారం మార్కెట్‌లో గుప్పుమంటోంది. ప్రైమ్ బ్రాండ్‌లన్నింటిని విక్రయానికి అందుబాటులో ఉంచుతారని ఇంకో ప్రచారం. బార్‌లు, మద్యం దుకాణాల నిర్వహణపైన సరికొత్త నిర్ణయాలు తీసుకోబోతున్నారు.

# నాలుగు నెలల్లో 26 మంది నవజాత శిశువుల మృతి

- ప్రజల ఆరోగ్యంపై అధికారులు శ్రద్ధ చూపాలి : కలెక్టర్ నాగరాణి



భీమవరంటౌన్, ఆగస్టు 24 : ప్రజలకు ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగు నీరందించే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆమె 'ప్రజల ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా'పై సమీక్షించారు. 'సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో 28 రోజుల్లోపు నవజాత శిశు మరణాలు.. నాలుగు నెలల్లో 26 మంది చనిపోవడం బాధాకరం. ఇటీవల ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువగా జ్వరం కేసులు నమోదవుతున్నాయి. ఇంటింటా ఫీవర్ సర్వే పక్కాగా నిర్వహించాలి. ఎవరికైనా జ్వరం ఉన్నట్లు గుర్తిస్తే వారికి పరీక్షల నిర్వహించి వెంటనే వైద్య సాయం అందించాలి. గత ఏడాది డెంగ్యూ కేసులు వచ్చిన ప్రాంతాల్లో మెడికల్ ఆఫీసర్లు, ఎంపీహెచ్ఏ, ఏఎన్ఎంలు ముందస్తు చర్యలు చేపట్టాలి. టీబీ కేసులో నమోదైన రోగులు టాబ్లెట్స్ వినియోగిస్తున్నారా ? మంచి ఆహారం తీసుకుంటున్నారా ? సంబంధిత సిబ్బంది ఆరా తీయాలి. జిల్లాలో స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈవోపీఆర్డీలు నిరంతరాయంగా పనిచేయాలి. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి నాగేశ్వరరావు, డీపీవో విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన సేవలందించాలి : జేసీ

రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు మేలైన సేవలందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో తహశీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, వివిధ శాఖల రెవెన్యూ అధికారులతో పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, స్వచ్ఛ ఆఫీస్ రికార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, అసైన్డ్ ల్యాండ్స్, పట్టా లాండ్స్, ఓల్డ్ ల్యాండ్స్, ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల తదితర అంశాలపై సమీక్షించారు. మీ కోసం పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులను నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి రికార్డులను సిద్ధం చేసి ఈ నెల 28లోగా సమర్పించాలన్నారు. కోర్టు కేసులపై తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించా లని, ఈ పనిని కిందిస్థాయి సిబ్బందికి అప్పగించవద్దని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తాడేపల్లిగూడెం ఇంచార్జి ఆర్డీవో బి.శివన్నారాయణరెడ్డి, నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు.

- మాకు ఏదీ రక్షణ..?



వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా.. తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉద్యాన విద్యార్థినుల వినూత్న ప్రదర్శన

## ప్రేమ.. పెళ్లి.. దాడి

ప్రేమ పెళ్లికి సహకరించాడనే కోపంతో ఓ వ్యక్తి, అతని కుటుంబ సభ్యులపై 40 మంది మూకుమ్మడిగా కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో శనివారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. 7లో..

## కూలిన పాఠశాల షెడ్

## స్కూల్‌లో పేలిన కుక్కర్

- 7లో..

## భూ వివాదం.. కొడుకుపై దాడి

ఓ భూవివాదం.. కుటుంబ సభ్యుల మధ్య గొడవలు తెచ్చింది. చివరకు కొడుకుపై తండ్రి, బంధువులు కలిసి ఇనుప రాడ్డుతో విచక్షణా రహితంగా దాడి చేసే వరకు వెళ్లింది. ఈ ఘటన ద్వారకా తిరుమల మండలం కోడిగూడెంలో జరిగింది. 7లో..



యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

## రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం : మంత్రి పార్థసారథి

చింతలపూడి, ఆగస్టు 24: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నామవరం వద్ద నాబార్డు నిధులు రూ.20 కోట్ల వ్యయంతో బోయ గూడెం-సీతానగరం బీటీ రోడ్డు పనులకు సంబంధించి ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో పాటు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ రూపొందించిన జనహితం యాప్‌ను కూడా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో చేపట్టే రోడ్లతో పాటు ప్రతి నియోజకవర్గానికి 10 నుంచి రూ.20 కోట్లు వ్యయం కాగల ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయాలనే లక్ష్యం కూడా ఉందన్నారు. కొన్నిరోడ్లను తీసుకుని పీపీటీ విధానంలో అభివృద్ధి పర్చ నున్నట్టు చెప్పారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారి కూడా ఇందులో ఉంద న్నారు. పొగాకు రైతుల అభ్యర్థన మేరకు సీలింగ్ లిమిట్ తీసేందుకు కేంద్రంతో మాట్లాడి చర్యలు తీసుకున్నామన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఘంటామురళీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, జనసేన ఇన్‌ఛార్జ్ మేకా ఈశ్వరయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్, పాల్గొన్న ఎస్పీ కిషోర్

## సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 24 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో సెప్టెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఆదేశాల మేరకు జిల్లా జడ్జీలు, ఎస్పీ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ప్రభుత్వ న్యాయవాదులు, జిల్లా కారా గార సూపరింటెండెంట్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులతో సమ న్వయ సమావేశం నిర్వహించామన్నారు. కేసులను త్వరితగతిన విచారించడానికి ఉన్న వనరులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపైన చర్చించినట్టు తెలి పారు. సాక్ష్యులుగా ఉన్న ప్రభుత్వ అధికారులు, వారు పనిచేసే స్థానాలను గుర్తించి సమన్లు అమలు చేయడం ద్వారా కేసుల పరిష్కారాన్ని ముందుకు తీసుకు వెళ్ళవచ్చని తెలిపారు. ఖైదీలను ఆన్‌లైన్ ద్వారా ప్రవేశపెట్టడం, సమన్లను ఎన్‌స్టెప్ ద్వారా అమలు చేయడం వల్ల త్వరితగతిన కేసులను పరిష్కరించ వచ్చు నని సూచించారు. జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ కేసుల విచారణకు పోలీసు వ్యవస్థ సహకరిస్తుందన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు కృష్ణారెడ్డి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెండవ అదనపు జిల్లా జడ్జి మంగాకుమారి, 8వ అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్, ఏలూరు బార్ అధ్యక్షుడు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మణరెడ్డి, ప్రభుత్వ న్యాయ వాది బీజే రెడ్డి, జిల్లా కారాగార సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.

## తాళాబత్తులకు తెలుగు వెలుగు పురస్కారం



పాలకొల్లు అర్బన్, ఆగస్టు 24: పాలకొల్లుకు చెందిన నాటక రచయిత, నటుడు తాళాబత్తుల వెంకటేశ్వర రావుకు హైదరాబాద్ యువ కళావాహిని సాంస్కృతిక సంస్థ అమరావతి తెలుగు వెలుగు పురస్కారం ప్రదానం చేసింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం గుంటూరులో జరి గిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ చేతుల మీదుగా పురస్కారం అందు కున్నట్టు వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

## మూడు నెలలు కావస్తున్నా వైసీపీ బొమ్మలే..!



పోలవరం, ఆగస్టు 24 : వైసీపీ ప్రభుత్వం పోయి మూడు నెలలు గడుస్తున్నా మండలంలో అన్ని పంచా యతీల పరిధిలో గ్రామాలలో మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యేల ఫొటోలతో బోర్డులే దర్శన మిస్తున్నాయి. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనుని గ్రామ సభలో పలువురు కూటమి నాయకులు ప్రశ్నిస్తే మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్డులను మండల పరిషత్ తీర్మానం లేకుండా తొల గించడం కుదరదని, ఉన్నతాధికారుల ఆదేశాలు లేవని చెప్పారు. రాష్ట్రంలో అన్ని మండలాల్లో బోర్డులు మారినా పోలవరం మండలంలో బోర్డులు మారక పోవడం విచారకరమని టీడీపీ సీనియర్ నాయకుడు కుంచే దొరబాబు విమర్శించారు. అధికారుల తీరు మారాలని జిల్లా అధికారులు స్పందించి పాత ప్రభుత్వ బోర్డులు తొలగించి కూటమి అధినేతల ఫొటోలు పెట్టాలని కోరారు.

# జయ కృష్ణా.. ముకుందా..మురారి

పాఠశాలల్లో కృష్ణాష్టమి సందడి ముందే వచ్చేసింది. శనివారం వివిధ స్కూళ్లలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణయ్య గోపికమ్మల వేషధారణలతో అలరించారు. ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



పెనుగొండ భాష్యం స్కూల్‌లో..



అలంపురం టీబీఆర్ స్కూల్‌లో..





**రాధా..మనోహరం**

నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకుని వైభవ వేంకటేశ్వరస్వామిని రాధా కృష్ణులుగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు

-నరసాపురం రూరల్



ఏలూరు శర్వాణీ స్కూలులో గోపికల నృత్య ప్రదర్శన



తణుకు మాంటిస్సోరి స్కూల్ సందడి



వేషధారణ పోటీల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరి విద్యార్థులు

## గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో క్రీడా ప్రాజెక్టు మీట్

దెందులూరు, ఆగస్టు 24: వ్యాయామ విద్యనభ్యసించే విద్యార్థులు ప్రతి క్రీడలోను నియమ నిబంధనలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని గోపన్న పాలెం గ్రామ మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ అన్నారు. శనివారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ఆవరణలో క్రీడా ప్రాజెక్టు మీట్-2024 నిర్వహించారు. 100, 200, 800 మీటర్ల పరుగుపందెం, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిబుల్ జంప్, జావలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో డి.వేణు, దేవరాజు, ధ్యాన్‌చంద్, బాలికల విభాగంలో మహలక్ష్మీ, జయశ్రీ, నందినిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రశంసాపత్రం, కాంస్య పతకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియల్, కళాశాల స్థల దాత చలసాని శ్రీధర్‌బాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చింతా సుబ్బా రావు, శ్రీను, బొర్రా చందు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





క్రీడాజ్యోతి వెలిగించి ప్రాజెక్టు మీట్ ప్రారంభించిన దృశ్యం.. మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులతో కళాశాల సిబ్బంది

### కవల దూడల జననం



దెందులూరు, ఆగస్టు 24 :దెందులూరు మండలం గాలాయగూడెం పంచాయతీ పరిధిలోని నాగులదేవునిపాడు శివారు గ్రామంలో నారకొండ శ్రీహరి అనే పాడి రైతుకు చెందిన గేదెకు కవల దూడలు పుట్టాయి. పరిసర గ్రామాల రైతులు వచ్చి దూడలను చూసి వెళుతున్నారు.

### స్కూల్లో పేలిన కుక్కర్ ..

చింతలపూడి, ఆగస్టు 24: సుబ్బరాజు పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తయారు చేసేందుకు కుక్కర్‌లో పప్పు వండుతున్న సమ యంలో కుక్కర్ ఒక్కసారిగా పేలింది.వేడివేడి పప్పు హేమ అనే కార్మికు రాలిపై పడటంతో స్వల్పగాయాలయ్యాయి. దీనిపై ఎంఈవో జి.రామా రావు మాట్లాడుతూ బాధితురాలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించామని ప్రమాదం తప్పిందన్నారు.

### కూలిన పాఠశాల షెడ్డు.. తప్పిన ప్రమాదం



ఉండి ఆగస్టు 24 : వర్షాలకు పాఠశాల పైకప్పు కూలిపోయింది, విద్యార్థులు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఉండి గ్రామంలోని 1 నుంచి 5వతరగతి వరకు నిర్వహించే క్రిస్టియన్ మైనారిటీ స్కూల్ సిమెంటు రేకుల షెడ్డు పైకప్పు గోడతో సహా కూలిపోయింది. స్కూల్ సమయం కాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.ఎంపీటీసీ రామలింగేశ్వరరావు పరిశీలించి అధికారులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్న సమయంలో షెడ్డు రేకులు జారి పడడంతో ఒక పాపకు స్వల్పంగా గాయమైంది..



### హోరాహోరీగా అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం అర్బన్, ఆగస్టు 24 : భీమవరం ఇండోర్ స్టేడియంలో జరుగు తున్న మెంటే సుబ్బారావు నాగరత్నం మెమోరియల్ సబ్ జూనియర్ అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.ఈనెల 25న సెమీ ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

### 30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, ఆగస్టు 24: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వతేదీన శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏలూరు జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జిల్లా జడ్పీ సీఈవతో సుబ్బారావు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన గౌరవ లోక్‌సభ సభ్యులు, శాసనసభ్యులను స్థాయి సంఘాల ఎన్నిక , జిల్లా అధికా రులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు.

### కోల్‌కతా ఘటనపై ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిరసన

నూజివీడు టౌన్, ఆగస్టు 24: మౌనాన్ని వీడుదాం..బాధితులకు సంఘీ భావంగా నిలిచి దోషులకు కఠిన శిక్ష పడేలా చేద్దాం.. అంటూ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు కోల్‌కతా ఘటనపై ర్యాలీ నిర్వహించారు. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో మానవహారాన్ని నిర్మించారు. వైద్యు రాలిపై జరిగిన హత్యాచారంపై మౌనాన్ని వీడాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### శ్రీవారి క్షేత్రం భక్తులతో కిటకిట



ద్వారకాతిరుమల, ఆగస్టు 24: చిన్న తిరుమలేశుని ఆలయాన్ని శనివారం దాదాపు పదిహేనువేల మంది పైబడి భక్తులు సందర్శించారు. ఉదయం అంతంత మాత్రంగా ఉన్న భక్తులు 11 గంటల నుంచి పెరిగారు. దీంతో అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. ఉచిత దర్శనానికి గంట న్నర పైబడి సమయం పట్టింది. వకుళమాత అన్నప్రసాద భవనానికి వెళ్లి స్వామివారి అన్న ప్రసాదాన్ని భుజించారు.

### 28 నుంచి లక్ష్మీపురం శ్రీనివాసుని పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 24: పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీ పురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథస్వామి ఆలయంలో శ్రీనివాసుని పవిత్రోత్సవాలు ఈనెల 28 సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నట్లు ఈవో త్రినాథరావు తెలిపారు. 31 వరకూ నాలుగురోజుల పాటు నిర్వహిం చనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ప్రతీ ఏటా వీటిని నిర్వహిస్తారు. 28 సాయంత్రం అంకురార్పణ, 29న పవిత్రాధివాసం, 30న పవిత్రారోపణ, 31న జరిగే శ్రీమహా పూర్ణాహుతితో ఉత్సవాలు పూర్తవుతాయని తెలిపారు.

### ఆకివీడు వీవీగిరి కళాశాలకు నాక్ బృందం

**స్వర్ణోత్సవాలకు సిద్ధం**



ఆకివీడు రూరల్ ఆగస్టు 24 : పశువుల పాక నుంచి పక్కా భవనాలకు ఎదిగి వందలాది మంది జీవి తాలలో వెలుగు నింపి 50 వసంతాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలకు సిద్ధ మైన ఆకివీడు వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేంద్ర ప్రభుత్వ బృందం (నాక్) ఈనెల 29, 30 తేదీలలో పర్యటించనున్నది. పూర్వపు విద్యార్థులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లి దండ్రులతో మమేకమై వివరాలు సేకరి స్తారు. నాక్ గుర్తింపు పొందితే కాలేజీ దశ దిశ మారిపోనున్నది. గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో గాంధేయవాది చింతల పాటి వరప్రసాద మూర్తిరాజు తన తండ్రి బాపిరాజు ధర్మసంస్థ పేరున 1974లో మాజీ రాష్ట్రపతి వరాహగిరి, వెంకటగిరి (వివిగిరి) బీఏ, బీకామ్ కోర్సులతో 60 మంది విద్యార్థులతో పాకలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. మొలుగు రఘునాధాచార్యులు పలువురు దాతల సహకారంతో 14 ఎక రాల్లో కళాశాల విస్తరించింది. ప్రస్తుతం బీఏ, బీకాం కోర్సులతో పాటు, బీఎస్సీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కాలేజీలో రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్, ప్రధానమంత్రి విశ్వకర్మ, స్కిల్ హబ్ ద్వారా విద్యార్థులకు సర్టిఫికెటెడ్ వృత్తి విద్యాకోర్సులు నేర్పుతున్నారు. అధునాతన సౌకర్యాలతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేశారు. యోగా, మెడిటేషన్ సెంటర్, వాకర్స్‌క్లబ్, లియోక్లబ్, ఎన్ఎస్ఎస్ ఆర్గనైజేషన్‌లున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.



## క్రైం కార్నర్

### భూ తగాదా..కొడుకుపై తండ్రి దాడి



క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, ఆగస్టు 24: భూమి తగాదాలో ఒక వ్యక్తిపై అతని తండ్రి, బావలు, వారి కుమారులు ఇనుప రాడ్డులతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన అతడిని ద్వారకా తిరుమల పీహెచ్‌సీకి తరలించి అనంతరం మెరు గైన చికిత్స కోసం ఏలూరుకు పంపారు. కోడి గూడెంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దౌలూరి కాంత య్యకు తన కుమారుడు ధర్మారావుతో పొలం విషయంలో కొంత కాలంగా తగాదా ఉంది. తన కుమార్తెలు, అల్లుళ్లు, మనవళ్లను ఇంటికి పిలిపించాడు. శనివారం మధ్యాహ్నం కుమారుడు ధర్మా రావుపై అతని తండ్రి, బావలు డేవిడ్‌రాజు, దాసరి గంగరాజు అతని కుమారులు సుందరరావు, వంశీలు ఇనుప రాడ్డులతో దాడి చేశారు. దీంతో భయపడిన ధర్మారావు భార్య, పిల్లలు పారి పోయి ద్వారకాతిరుమల పోలీ సులను ఆశ్రయించారు. పోలీసులు బాధి తుడిని ముందుగా ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. దాడిచేసిన ఐదుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

పెదపాడు, ఆగస్టు 24 : శుభకార్యానికి వెళ్లి భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో మోటారుసైకిల్ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలై వివాహిత మృతి చెందిన ఘటన పెదపాడు మండలం అప్పనవీడులో శనివారం చోటు చేసుకుంది. పెదపాడు మండలం సత్యవోలు శివారు కొత్తూరుకు చెందిన వెంకట మహాలక్ష్మి (60) భర్త కోట్రప్రోలు ఉమామహేశ్వరరావుతో కలిసి హనుమాన్ జంక్షన్ వెళ్లి తిరిగి వస్తుండగా అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడి వద్ద వెనుక నుంచి మరో మోటారుసైకిల్ ఢీకొంది. ప్రమాదంలో మహాలక్ష్మి తీవ్రగాయాలపాలై అక్కడి కక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 24 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి ప్రమా దవశాత్తు అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రుని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జంగారెడ్డి గూడేనికి చెందిన చిడిపి కల్యాణ్‌బాబు (27) పల్సర్ మోటారు సైకిల్‌పై పెనుగొండ నుంచి ఏలూరు వైపు వస్తున్నాడు. మార్గ మధ్యలో భీమడోలు అయ్యప్పస్వామి గుడి ఎదురుగా రోడ్డు సరిగా లేక పోవడం వల్ల మోటారు సైకిల్ అదుపుతప్పి శనివారం ఉదయం పడి పోయాడు. తీవ్ర గాయాలకు గురై పడిపోయి ఉన్నట్లు హైవే పెట్రోలింగ్ వాహనానికి సమాచారం అందింది. దీంతో హైవే పోలీసులు హుటాహుటిన క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### గుర్తుతెలియని వాహనం ఢీ.. అపస్మారక స్థితిలోకి యువకుడు



ఏలూరు క్రైం, ఆగస్టు 24: బులెట్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళి పోయాడు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వంతెన కింద భాగంలో బులెట్‌పై (ఏపీ 31డిహెచ్ 7142) వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఏలూరు హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి 108లో క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది. క్షత గాత్రుడు అపస్మారక స్థితిలో ఉన్నాడు

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెదపాడు, ఆగస్టు 24 : మద్యంలో మంచినీరు అనుకుని బొద్దింకల మందు కలుపుకుని తాగి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై పెదపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన పోలగాని వెంకటసాంబశివరావు (26) తోపుడు బండిపై హనుమాన్ జంక్షన్‌లో పండ్ల వ్యాపారం చేస్తూ తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యం బాగోలేదని తల్లి వరలక్ష్మి 20 రోజుల క్రితం కుమార్తె వద్దకు వెళ్లింది. సాంబశివరావు 23వ తేదీన బొద్దింకల మందును మంచినీరు అనుకుని మద్యంలో కలుపుకుని తాగాడు. ఈ విషయం చుట్టుపక్కల వారికి తెలియజేయగా వారి సాయంతో తొలుత హనుమాన్ జంక్షన్, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమ వివాదం

### పెళ్లికి సహకరించాడని యువతి తరపు బంధువుల దాడి



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 24 : ప్రేమించిన వాడితో పారిపోయి పెళ్లి చేసు కునేందుకు సహ కారం అదించాడనే కోపంతో యువతి బంధు వులు మందపాటి రాజు, అతని కుటుంబ సభ్యులపై సుమారు 40 మంది మూకుమ్మడిగా కర్రలతో దాడి చేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో శనివారం సంచలనం రేపింది. జంగారెడ్డి గూడెం మండలం అక్కంపేటకి చెందిన పారేపల్లి జాహ్నవి, ఆమె ఇంటి పక్కనే ఉంటున్న గణేష్‌లు ప్రేమించుకున్నారు. వీరిద్దరిది ఒకే సామాజిక వర్గం. గత ఆగస్టు 15న ఇద్దరూ ఇంటి నుంచి వెళ్ళిపోయి భద్రాచలం రాముడి సన్నిధిలో పెళ్లి చేసుకున్నారు. అయితే తమ కుమార్తెకు గణేష్‌తో వివాహం చేయడంలో గణేష్‌కు వరుసకు బావ అయిన మంద పాటి రాజు మధ్యవర్తిగా వ్యవహరించాడన్న అనుమానంతో శనివారం మైసన్నగూడెం గ్రామానికి సుమారు నలభై మంది ద్విచక్ర వాహనాలు, కార్లతో రాజు ఇంటికి వెళ్లారు. జాహ్నవి ఎక్కడుందో చెప్పాలంటూ వైసీపీకి చెందిన అక్కంపేట సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర, నాగార్జున, కొప్పుల శ్రీను, మణికే నాగేశ్వరరావు, బల్లే విజయ్, సులకాని నాగబాబు మరికొంతమంది రాజు, అతని తల్లి కనకదుర్గ, గణేష్ తల్లి శశిరేఖలపై దాడి చేసి కర్రలతో కొట్టారని బాధితులు తెలిపారు. కనక దుర్గపై బాటిళ్ళతో తెచ్చుకున్న పెట్రోలు పోసి చంపుతామని బెదిరించారని తమ కారును కూడా ధ్వంసం చేశారని బాధితుడు రాజు తెలిపాడు. గ్రామస్థులు అడ్డుకుని గాయపడిన ముగ్గురిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే రాజు అతని కుటుంబ సభ్యులపై జరిగిన దాడిని తెలుసుకున్న గణేష్, జాహ్నవి ఒక వీడి యోను వాట్సప్‌లో పోస్ట్ చేశారు. "తమ వివాహం ఇష్ట ప్రకారం జరి గిందని మా గురించి ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని" పురుగుమందు డబ్బా పట్టుకుని ఆత్మహత్యాప్రయత్నం చేశారు. ఆసుపత్రిలో బాధితులను డీఎస్పీ రవిచంద్ర పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు..ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి సర్పంచ్ నాగేంద్రతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఆసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజేష్, ఎస్ఐ షేక్ జబీర్ పర్యవేక్షించారు.

## పాఠశాలలో సమస్యకు పరిష్కారం



పాఠశాల ఆవరణలో మట్టిపోసి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

ఆకివీడు, ఆగస్టు 24 : ఏళ్ళ తరబడి ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమస్యను టీడీపీ-జనసేన పరిష్కరించాయి. పాఠశాలలోకి వెళ్లేందుకు ఉన్న ప్రాంగణం వర్షాలకు నీరు నిలబడి వెళ్లుందుకు లేకుండా ఉండడమే కాకుండా విద్యార్థులు దోమలు, విష పురుగుల బారిన పడుతున్నారు. దీంతో టీడీపీ మండల, జనసేన పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, పిల్లా బాబులు సారధ్యంలో ఇసుకతో ఆ ప్రాంతాన్ని మెరక చేయించారు.

## నూతన చట్టాలు నిలుపుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న లాయర్లు

భీమవరం క్రైం/భీమవరం టౌన్, ఆగస్టు 24 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన సివిల్, క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలంటూ భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాసే కొత్త చట్టాలను ఉపసంహరించుకోవాలని, కొత్త చట్టాలు ప్రజల హక్కులు హరించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ వై.న్యూటన్, వైవీ ఆనంద్, పాల రాఘవేంద్రరావు, రామకృష్ణ, వీరవల్లి బాబుజీ, సూరిబాబు, ఎల్ లక్ష్మణ రావు పాల్గొన్నారు.

## ఫార్మసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి




భీమవరం అర్బన్, ఆగష్టు 24 : అచ్యుతాపురం ఫార్మసీ కంపెనీ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. శనివారం తాలుకా ఆఫీసు సెంటర్లో సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు.

## భూ బాధితుల సదస్సు విజయవంతం చేయాలి

భీమవరం అర్బన్, ఆగస్టు 24: ఈ నెల 28న సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న భూ బాధితుల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో భూబాధితుల రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ప్రైవేటు భూములు వేలాది ఎకరాల అన్యాక్రాంతం కావడం జరిగిందన్నారు. ప్రజలు పోగొట్టుకున్న భూములు తిరిగి దక్కించేందుకు సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మొక్కలు నాటిన అధ్యాపకులు, విద్యార్థులు




గణపవరం, ఆగస్టు 24: భూమిపై జీవించడానికి ప్రధాన కారణాలైన మొక్కల్ని విద్యార్థులు ప్రేమతో పెంచాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి కోరారు. గణపవరం చింతలపాటి మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం వన మహోత్సవం నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తీసుకొచ్చిన 120 మొక్కలను కళాశాలలో నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతి ప్రేమికులుగా మారాలన్నారు. వైస్ పిన్సిపాల్ మధురాజు పాల్గొన్నారు.

## నిధులు కేటాయించిన మంత్రికి కృతజ్ఞతలు

పాలకొల్లు రూరల్, ఆగస్టు 24 : దిగమర్రు పంట కాలువ ప్రక్షాళనకు మంత్రి నిమ్మల రామానాయుడు రూ.12.27 కోట్లు మంజూరు చేయించడం పట్ల మండల పరిషత్ సమావేశంలో దిగమర్రు గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ కృతజ్ఞతల తీర్మానాన్ని మండల పరిషత్ సమావేశం ఆమోదించింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ చిట్టూరి కనక లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు ప్రజా సమస్యలపై అధికారులను సభ్యులు ప్రశ్నించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగాఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిహెచ్ఈవో హరిబాబు సూచించారు.

## లోవోల్టేజ్ సమస్యపై సీఎండీకి ఫిర్యాదు

కాళ్ళ, ఆగస్టు 24 : దొడ్డనపూడి గ్రామంలో గత ఏడాది నుంచి లోవోల్టేజ్ సమస్య వలన సుమారు 300 ఇళ్లకు చెందిన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం అప్పట్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఒక వైసీపీ నాయకుడి ప్రోద్బలంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారని గ్రామస్థులు ఆరోపించారు. దీని వలన గత 20 రోజులుగా తమ ఇళ్లకు కరెంటు లేకుండా ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండలస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో విశాఖ ఏపీ ఈపీడీసీఎల్ సీఎండి పృథ్వితేజకు బీజేపీ యువ మోర్చా కాలేజీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవి, ప్రధానకార్యదర్శి యిర్రింకి నాగశ్రీనివాసనాయుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## సంక్షిప్త సమాచారం..

- **భీమవరం టౌన్:** మహిళలకు స్వేచ్ఛ కావాలనే నినాదంతో జమాత్ ఇస్లామిక్ హింద్ మహిళా విభాగం, గర్ల్స్ఇస్లామిక్ ఆర్గనైజేషన్ విభాగం ఆధ్వర్యంలో శనివారంనాడు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.
- ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు భీమవరంలో నిర్వహించే తెలుగు భాషా దినోత్సవ బ్రోచర్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శనివారంనాడు ఆవిష్కరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.
- **నరసాపురం రూరల్:** మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, సీడీపీవోల ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అంగన్‌వాడీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి సీడీపీవో ఊర్మిళ, డీసీపీవో మమత విచ్చేశారు.
- **పాలకొల్లు అర్బన్:** ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 60 మంది హాజరు కాగా, 26 మంది ఎంపిక అయ్యారు. వీరిలో తమ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఉన్నట్టు ప్రిన్సిపాల్ రాజ రాజేశ్వరి తెలిపారు.
- **భీమవరం ఎడ్యుకేషన్:** భీమవరంలో ఆక్సిజన్ బ్యాంక్, సీఎస్ఆర్ సేవలకు కొవిడ్ విరాళం రూ.5లక్షలు ఇచ్చినందుకు హైదరాబాద్‌లో జరిగిన మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలలో పట్టణానికి చెందిన సూర్యమిత్ర ఎగ్జిమ్ అధినేత డా.యిర్రింకి సూర్యారావును ఘనంగా సత్కరించారు.
- **ఆకివీడు:** జానకీనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు పాలకోడేరు లయన్స్ క్లబ్ సభ్యుడు పాలేశ్వరరావు విద్యా సామగ్రి అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకొని సమాజానికి ఉపయోగపడాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌ను సన్మానించారు.
- **పెంటపాడు:** డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళల సమాన హక్కుల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.శివరామకృష్ణ హాజరై మహిళా చట్టాలు, హక్కులపై వివరించారు.
- **నరసాపురం టౌన్:** రుస్తుంబాదా ప్రాంతానికి చెందిన పోలిశెట్టి నాగబాబు అనారోగ్యంతో మంచంపట్టాడు. కుటుంబ పోషణ లేకపోవడంతో స్పందించిన పడాల సురేష్ తనవంతు సాయంగా రూ 20వేలు సాయాన్ని అందించారు.






నరసాపురంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన.. తాడేపల్లిగూడెంలో ఉద్యాన కళాశాల విద్యార్థుల నిరసన ప్రదర్శన

# వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ప్రదర్శన

నరసాపురం టౌన్, ఆగస్టు 24: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వైఎన్ కాలేజీ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన అంబేడ్కర్ సెంటర్ వరకు సాగింది. అక్కడ కొద్దిసేపు మానవహారం చేశారు. ఈ ప్రదర్శనలో 800 మంది వివిధ కాలేజీలు, స్కూళ్ళకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వైద్యురాలిపై అఘాయిత్యం చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

### ఉద్యాన విద్యార్థుల నిరసన

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 24: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని నినాదాలు చేశారు.

## మానసిక వికలాంగుల పాఠశాలకు విరాళం

కాళ్ళ, ఆగస్టు 24 : పెదఅమిరం గ్రామంలో అరుణోదయ మానసిక వికలాంగుల పాఠశాలకు గ్రామానికి చెందిన ముదునూరి రామరాజు, లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట సత్యవిజయ్‌కుమార్‌రాజు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వసుధ కృష్ణంరాజు, డా.ఎంవీఎస్ రాజు, ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు సాయం

కాళ్ళ, ఆగస్టు 24 : దొడ్డనపూడి గ్రామానికి చెందిన పోతులరాజు ఇస్మాయిల్, తెనాలి అబ్రహాంలు ఇటీవల ప్రమాదానికి గురై భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాస్విని చారిటబుల్ ట్రస్టు ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.25వేలు మొత్తం 50వేలను గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు సాయం చేశారు. మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్ పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తి గంగరాజు

నరసాపురం టౌన్, ఆగస్టు 24: వచ్చే నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించి, కక్షిదారులకు న్యాయం జరిగేలా పోలీసులు సమన్వయంతో పని చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. శనివారం కోర్టు హాల్‌లో వివిధ మండలాలకు చెందిన పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీ చేయడానికి వీలుపడే కేసులన్ని ముందుగా గుర్తించాలన్నారు. ఇరుపార్టీలకు నోటీసులు, కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల కొన్ని కేసులు రాజీ చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, సీఐ యాదగిరి, దుర్గాప్రసాద్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 24 : స్థానిక పెంకుళ్ళ పాడు వద్ద (టిడ్కో గృహాల కాలనీ) ఆదివారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు తిరుమల హాస్పటల్ డాక్టర్ వట్టూరి రమేష్ తెలిపారు. వైద్య శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తామన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉండి ఆగస్టు 24: సైబర్ నేరాలు...మత్తు పానీయాలపై విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని ఆకివీడు సీఐ జగదీశ్వరరావు హెచ్చరించారు. శనివారం కాపులపేటలోని దివ్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టరు దుర్గారావు అధ్యక్షత వహించారు. ఎస్ఐ నజీరుల్లా, కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ టివి.సూర్యనారాయణ, పాల్గొన్నారు.

## జ్యోతికశ్రీని ఆదర్శంగా తీసుకోవాలి



జ్యోతికశ్రీకి నగదు బహుమతి అందిస్తున్న ప్రకాశరావు

తణుకు, ఆగస్టు 24: ఎంచుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు కృషి చేసి ఒలింపిక్స్ వరకు చేరిన అథ్లెట్ జ్యోతి కశ్రీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మాంటిస్సోరి స్కూలు డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు అన్నారు. శనివారం స్కూలు ప్రాంగణంలో ఒలింపిక్స్‌లో పాల్గొన్న తమ పాఠశాల పూర్వ విద్యార్థిని జ్యోతికశ్రీని సత్కరించి రూ. 25 వేల నగదు ప్రోత్సాహం అందించారు. జ్యోతికశ్రీ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు సమస్యపై సీఎంకు ఫిర్యాదు

ఆకివీడు రూరల్ ఆగస్టు 24 : పెదకాపవరం గ్రామంలో రజక చెరువు సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు రజక సంఘం నాయకులు తెలిపారు. 1999లో సీఎం చంద్రబాబునాయుడు హయాంలోనే 70సెంట్లు భూమిని సేకరించి కొనుగోలు చేసి రజక చెరువు తవ్వి కులవృత్తి చేసుకునేవిధంగా సహాయపడ్డారని తెలిపారు. అయితే దానిని 2020లో అడంగల్ వెబ్‌ల్యాండ్‌లో వ్యవసాయేతర భూమికి మార్చబడినదని తెలిపారు. 2023లో అదే గ్రామానికి చెందిన వ్యక్తి పేరుమీద మార్పడం జరిగిందని, దాంతో వారు వచ్చి చెరువుగట్లు ధ్వంసం చేసి అడ్డువచ్చిన తమ సంఘీయులపై దాడిచేశారని సీఎంకు ఫిర్యాదు చేశారు. సీఎంను కలిసిన వారిలో రజక సంఘ నాయకులు యండమూరి సత్యనారాయణ, సూర్యనారాయణ, ఇండికాపల్లి ఫణికుమార్, కట్లయ్య తదితరులున్నారు.

## ఎస్‌వీకేపీ అధ్యక్షుడిగా నాగిరెడ్డి



పెనుగొండ, ఆగస్టు 24: ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గవర్నింగ్ బాడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించిన తాడి నాగిరెడ్డి ఇప్పటి వరకు ఎస్‌వీకేపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసోసియేషన్ యాజమాన్యం అధ్యక్షులుగా ఎన్నికయ్యారన్నారు. గవర్నింగ్ బాడి సభ్యులు ఏకగ్రీవంగా అంగీకారం తెలియజేసినట్లు తెలిపారు.

## మాజీ జడ్పీటీసీ బండి రామారావు మృతి



ఆచంట, ఆగస్టు 24: ఆచంటకు చెందిన టీడీపీ సీనియర్ నేత మాజీ జడ్పీటీసీ బండి రామారావు (68) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామారావు ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, గొడవర్తి శ్రీరాములు, మండల టీడీపీ అధ్యక్షుడు కేతా మీరయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఎస్కేఎస్డీలో ఫ్రెషర్స్ డే

తణుకు, ఆగస్టు 24: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో అభివృద్ధి సాధించాలని ఎస్కేఎస్డీ మహిళా కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. శనివారం ఎస్కేఎస్డీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపల్ బి. హిమబిందు, కోశాధికారి నందిగం సుధాకర్, వివేకానంద గ్లోబల్ స్కూలు కార్యదర్శి చిట్టూరి రీనా సాయి, ఎస్డీ కాలేజి ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: బొలిశెట్టి



సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 24: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డు లో రూ. 10 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రారంభించారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని తేతలి సత్యనారాయణమూర్తి జడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి పాఠశాల అభివృద్ధి సమన్వయకర్త ఎస్‌వీ సత్యనారాయణకు ఎమ్మెల్యే రూ. 50 వేలు విరాళం అందజేశారు.

## 27 నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు

పెంటపాడు, ఆగస్టు 24: మండలంలోని పాఠశాలల్లో ఈ నెల 27 నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రశ్నపత్రాలు సీల్డ్ కవర్లలో పంపిణీ చేస్తారని, హెచ్ఎంలు ఏ రోజుకా రోజు పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు కవర్లు తెరిచి పంపిణీ చేయాలన్నారు. వీటిని సోషల్ మీడియాలో పోస్టు చేయకూడదని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మొగల్తూరు, ఆగస్టు 24: జ్వరాలు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మొగల్తూరు ఆసుపత్రి వైద్యుడు దినేష్ సూచించారు. మొగల్తూరు పంచాయతీ పెద్ద గొల్లగూడెంలో నివాసాల మధ్య పరిసరాలను శనివారం పరిశీలించి మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగర్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో పడవేసిన కొబ్బరి డొక్కలు, ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, చెత్తాచెదారాలు, వాడకం నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు.

# రహదారి నిర్మాణానికి భూమి పూజ



ఆకివీడులో రహదారి నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న భరత్

ఆకివీడు/ఆకివీడు రూరల్/ఉండి, ఆగస్టు 24 : రోడ్లు సక్రమంగా ఉంటే ప్రజలు సంతోషంగా ఉంటారని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తనయుడు కనుమూరి భరత్ అన్నారు. శనివారం మూడు, నాలుగు వార్డులకు సంబంధించి అందేవారి బోదె నుంచి అగస్త్యేశ్వరస్వామి దేవాలయం వరకూ రహదారి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. అనంతరం దొరగారి చెరువు దగ్గర ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో భరత్ భోజనం చేసి మాట్లాడారు. గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో సుమారు 80 రోజుల నుంచి నడుపుతుండడం అభినందనీయమన్నారు. చెరుకుమిల్లిలో గ్రామదేవత కొండాలమ్మ అమ్మవారిని భరత్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 5వ తేదీన వీటిని ప్రారంభిస్తామని తెలిపారు.

# కుల ధ్రువీకరణ పత్రాల జారీపై పరిశీలన



ఆచంటలో కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ఆచంట/అత్తిలి, ఆగస్టు 24: కుల ధ్రువీకరణ పత్రాల జారీలో పొరపాట్లకు తావు లేని విధంగా క్షేత్ర స్థాయిలో అన్నివిధాలుగా విచారించిన తరువాతే జారీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం జాయింట్ కలెక్టర్ కుల ధ్రువీకరణ పత్రాల జారీ రికార్డులు సుమోటోగా పరిశీలనపై స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇప్పటికే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన కుటుంబాల ఇంటికి స్వయంగా వెళ్ళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సుగుణ సంధ్య, ఆర్ఐ జయలలిత, వీఆర్వో పాల్గొన్నారు. అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మంచిలిలో పర్యటించి స్థానికులతో మాట్లాడి కుల ధ్రువీకరణ పత్రం ఆవశ్యకతను వివరించారు.

## వెంకన్నకు ఊంజల్ సేవ



కాళ్ళ, ఆగస్టు 24 : కాళ్ళకూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామిఆలయంలో శ్రావణ శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని గుడివాడ మహిళా మండలి భక్తులచే కోలాటం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పంచమి పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుండి భక్తులు వివిధ గ్రామాల నుంచి అత్యధికంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ఆకివీడు రూరల్ ఆగస్టు 24 : దుంపగడప గ్రామదేవతలైన భూలక్ష్మమ్మ, మారెమ్మ, వెంకమ్మ అమ్మవార్ల ప్రతిష్ఠా వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఆలయ శిఖరాలపై బూరుల అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా హోమాలు నిర్వహించి, అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు దంపతులు, గ్రామస్థులు, ఉపసర్పంచ్ కొట్టు నాగరాజు, కొట్టు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ ఆలయానికి విరాళం

భీమవరం టౌన్, ఆగస్టు 24 : మావుళ్ళమ్మ ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన ఎన్.మల్లికార్జున స్వామి సౌమ్య దంపతులు 70వేల రూపాయలు కానుకగా సమర్పించారు. ముందుగా దాతలు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం తరుపున శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

## ఉపాధి పనులు నాణ్యతగా ఉండాలి

ఉండి, ఆగస్టు 24: ఉపాధి హామీ పథకంలో ప్రతి పని నాణ్యతతో పూర్తిచేయాలని డ్వామా పీడీ ప్రభాకరరావు అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి 17వ విడత సామాజిక తణిఖీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు చేపట్టిన పనులను, పూర్తి చేసిన వాటిని సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై డ్వామా పీడీ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామి పథకంలో మండలంలో 1260పనులను చేపట్టి పూర్తిచేశారన్నారు.

## ఆన్‌లైన్‌లో విద్యార్థులకు పరీక్షలు

ఉండి, ఆగస్టు 24: ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో సోషల్‌స్టడీస్ పరీక్ష రాశారు. వారం రోజులు నుంచి ఈపరీక్షలను విద్యార్థులు రాస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ట్యాబ్‌లు, టెక్నికల్ నాలెడ్జ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ విధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## పంచాయతీ కార్మికుల వినతి



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 24: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చి పరిష్కరించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జికి కూడా కార్మికులు తమ సమస్యలు చెప్పుకోగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్, ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.